క్లుప్తంగా

అంధకారంలో అనంతంపల్లె



వీధి లైట్లు వెలగకపోవడంతో అందకారంగా మారిన గ్రామంలోని ఓ వీధి

పుల్లంపేట : అనంతంపల్లె గ్రామంంలో విద్యుద్దీపాలు వెలగడం లేదు. సమస్య నెల రోజుల నుంచి ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో ఇంటి బయట తిరగాలంటే విష సర్పాలు వలన తమకు ఎక్కడ ప్రమాదం వాటిల్లుతుందోనని బయటకు రావడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అనంతంపల్లె పంచాయతీలో విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బసవేశ్వరుడికి గురుపూజ



ప్రత్యేక అలంకరణలో బసవేశ్వరుడు

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన శ్రీ బసవేశ్వరుడికి గురుపూజ నిర్వహించారు. ఆదివారం బసవ జయంతి సందర్భంగా బసవేశ్వరుడికి గురు పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజలలో భాగంగా స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పూలు, పట్టువస్త్రాలతో అలంకరణ చేశారు. ఈ పూజలు ఆలయ పాలక మండలి అధ్యక్షులు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు నాగభూషణం సురేష్‌బాబు, భాస్కర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వెంకటాయపల్లెలో గంగమ్మ జాతర



బోనాలను తీసుకొస్తున్న మహిళలు

సిద్దవటం : మండల పరిధిలోని వెంకటాయపల్లెలో ఆదివారం గంగమ్మ జాతరను గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన ఆకుపూజ, అర్చనలు చేశారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. గ్రామ పెద్దలు అమ్మవారికి ముద్దపెట్టి పూజలు చేసి కోడిపుంజులు ఇచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

వీరబల్లె ఎంపీపీకి పరామర్శ



ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డిని పరామర్శిస్తున్న సురేష్‌బాబు, ఆకేపాటి

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డిని కడప నగర మేయర్, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సురేష్ బాబు, కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు పరామర్శించారు. ప్రమాదవశాత్తు కిందపడి కాలికి శస్త్రచికిత్స చేయించుకొని తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో విశ్రాంతి తీసుకొంటున్న విషయం తెలుసుకున్న వీరు ఆదివారం వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆశించారు.

ఘనంగా అమ్మవారికి బోనాలు



పూజలందుకున్న గంగాభవాని

సిద్దవటం : మండలంలోని బంగారుపేట గ్రామ శివారులో వెలసిన గంగాభవాని అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బోనాల పండుగను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా అమ్మవారికి గణపతిపూజ, పుణ్యాహావాచనం వంటి పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు మాడా పెద్దసుబ్బరాయుడు ఫ్యామిలీ ట్రస్టు వారు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రకృతి సాగుపై అవగాహన

బి.కొత్తకోట: రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయసాగు వైపు మళ్లేందుకు రైతులకు అవగాహన పెంచుకోవాలని బండారువారిపల్లె సర్పంచు ఉజ్జయిని సాంబశివ కోరారు. ఆదివారం పంచాయతీలోని శీతివారిపల్లె, కురవపల్లెలో ఏపీసీఎస్‌ఎఫ్ సంస్థ రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రైతులకు సేంద్రీయ సాగుతో కలిగే లాభాలను వివరించారు.

హామీలను నెరవేర్చాం.. ఆదర్శంగా నిలిచాం

- శెట్టిపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



ద్రౌపది కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట

సంబేపల్లె : జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతుందని అన్నమయ్య జిల్లా వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శెట్టిపల్లె గ్రామంలోని కడియాలవాండ్లపల్లె, కె.కె. దళితవాడ, బండకాడపల్లె రాజువారిపల్లె, చిన్నబిడికి, పెద్దబిడికి, పరకలబండ బిడికి, బుర్జుకాడ దళితవాడలలో డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి గడప గడపకు కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సమస్యలపై ఆరా తీయడంతోపాటు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన పాలన అందించేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని సత్వర పరిష్కారానికి గడప గడప మన ప్రభుత్వం చేపట్టామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన సాగుతోందన్నారు. ఎన్నికలలోని మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే ఆదర్శంగా సీఎం జగన్ నిలుస్తారన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7:30 వరకు జరిగిన కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి 625 ఇళ్లకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నాడు.

ఇంటింటా అక్క చెల్లెమ్మల దీవెనలు

సంక్షేమ పథకాలను ప్రతి అక్కాచెల్లెమ్మకు అందడంతో ఎమ్మెల్యే ఎదుట మహిళలు ఆనందాన్ని వెలిబుచ్చారు. గతంలో చిన్న పనికి సైతం అధికారుల చుట్టూ తిరిగే వాళ్లమని ప్రస్తుతం జగన్ పాలనలో ఇంటికే వచ్చి పనులు చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, జెడ్పీటీసి కవిత, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, నాయకులు రమేశ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మండల స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

లోహిత్‌కుమార్ మృతి పట్ల సంతాపం

మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ బంగారువాండ్లపల్లెకు చెందిన లోహిత్‌కుమార్‌రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం లోహిత్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చారు.

ద్రౌపది కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మండలంలోని గుట్టపల్లె పంచాయతీ శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ సమీపంలో జరుగుతున్న మహాభారత యజ్ఞ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్రౌపది కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ చిదంబరంరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, సోమవరం సర్పంచ్ అనసూయమ్మలు హాజరయ్యారు.

4 నుంచి పెంచల నరసింహస్వామి ఉత్సవాలు

పెనగలూరు : మే నెల 4వ తేదీ నుంచి ఈటమాపురం పెంచల లక్ష్మీనరహింహస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, వైస్ చైర్మన్‌లు తిరుపాల్ రెడ్డి, బత్తిన పెద్ద గుండాల్ రెడ్డిలు తెలిపారు. ఇప్పటికే ఈటమాపురం, తూర్పుపల్లి, నాయుడువారిపల్లి గ్రామస్తులతో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మే నెల 4వ తేదీన పెంచల నరసింహస్వామి కల్యాణం వైభవంగా టీటీడీ వేదపండితులచే నిర్వహిస్తామన్నారు. 4 నుంచి 11వ తేదీ వరకు గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, కమిటీ సభ్యులు, మూడు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

వీధికుక్కల నివారణకు స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కుక్కలను పడుతున్న అనిమల్ కేర్ సిబ్బంది

రాయచోటి అర్బన్ : పట్టణంలో వీధికుక్కల నివారణకు స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. ఆదివారం మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సూచనల మేరకు కమిషనర్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో డ్రైవ్ కొనసాగుతోంది. తిరుపతికి చెందిన అనిమల్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం సభ్యులు పురవీధులలో తిరుగుతూ ప్రజలను భయపెడుతున్న వీధి కుక్కలను పట్టి తిరుపతికి తరలించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఏ ప్రాంతంలో వీధికుక్కల హడావుడి ఎక్కువగా ఉంటే ఆప్రాంత ప్రజలు సచివాలయం సిబ్బందికి, మున్సిపల్ అధికారులకు సమాచారమందించి కుక్కల పట్టివేతకు సహకరించాలంటూ కోరారు. పట్టణంలో అధికసంఖ్యలో ఉన్న వీధికుక్కలను పట్టేవిధంగా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. గాలివీడు రోడ్డు, రామాపురం, కొత్తపేట, బోస్‌నగర్ వీధులలో కుక్కలను పట్టినట్లు మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య తెలిపారు.

ముగిసిన మహాభారత యజ్ఞం



కర్ణ, దుర్యోధుని వధ ఘట్టాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరమ్మ ఆలయం వద్ద గత కొద్ది రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కర్ణ, దుర్యోధన వధ, శాంతి పర్వం, ధర్మరాజు పట్టాభిషేకం కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ భాగవతారిణి రత్నకుమారిచే నిర్విఘ్నంగా మహాభారత యజ్ఞం కొనసాగింది. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున ఈ మహోత్సవానికి హాజరై విజయవంతం చేశారు.

వైఎస్సార్ కుటుంబంతోనే ముస్లిం మైనార్టీలకు లబ్ధి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

రాజంపేట రూరల్ : ముస్లిం మైనార్టీలకు లబ్ధి చేకూరింది కేవలం వైఎస్సార్ కుటుంబం వలనేనని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు స్పష్టం చేశారు. జాతీయ రహదారిపై ఉన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు చేసిన ఆరోపణలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేటలో ముస్లిం మైనార్టీల అభివృద్ధికి దోహదపడింది టీడీపీ ప్రభుత్వం అని అనడం హాస్యాస్పదకంగా ఉందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో ముస్లింలకు మంత్రి పదవి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కడప జిల్లాకు చెందిన అంజద్‌బాషాకు డిప్యూటీ సీఎంగా, రాయచోటికి చెందిన జకీయాఖానంను మండలి డిప్యూటీ స్పీకర్‌గా, వైఎస్సార్ హయాంలో 4శాతం రిజర్వేషన్ కల్పించి ముస్లింల అభివృద్ధికి వైఎస్ కుటుంబం పాటుపడిందని వివరించారు. రాజంపేటలో శ్మశాన వాటికకు 4 ఎకరాల స్థలం ఎమ్మెల్యే మేడా మంజూరు చేయించగా, ఉర్దూ జూనియర్ కళాశాలను గతంలో ఎమ్మెల్యేగా ఉన్న ఆకేపాటి ఏర్పాటుకు కృషి చేశారని గుర్తు చేశారు. రాజంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని ముస్లిం మహిళకు ఇచ్చి గౌరవించారని తెలియజేశారు. టీడీపీ హయాంలో ముస్లింలకు చేసింది శూన్యమని, నిజాలు తెలుసుకోకుండా అబద్ధాలు మాట్లాడితే ముస్లింలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.ముజఫర్ అహమ్మద్, డాక్టర్ అజుముద్దీన్ జానీ, ఎస్.మున్వర్‌బాషా, సయ్యద్ అమీర్, ఎస్‌జీ ఇనామత్, ఎస్ఎండీ అబ్దుల్ కరీం, పి.కరీముల్లా ఖాన్, జానీ, ఇక్బాల్, మహమ్మద్‌గౌస్, అబ్దుల్‌ఖాదర్, మస్తాన్, రఫీ, మహబూబ్‌బాషా, యూసఫ్, ఇర్ఫాన్, ఆరీఫ్, సులేమాన్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు



లక్కిరెడ్డిపల్లె: ప్రత్యేక అలంకారంలో గంగమ్మ



భక్తులకు దర్శనమిస్తున్న మల్లూరమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానదిపై కొలువైన శ్రీ మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

లక్కిరెడ్డిపల్లె గంగమ్మ ఆలయంలో..

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ దర్శనానికి వేలాది మంది తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజులు క్యూ లైన్‌లో భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా పుస్తక రచయితల దినోత్సవం



పుస్తక దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చిట్వేలి : పుస్తక పఠనం విజ్ఞాన సముపార్జనకు సాధనమని పుస్తక రచయిత, ఉపాధ్యాయుడు దొండ్లవాగు శ్రీనివాసులు, సినీ గేయ రచయిత పుట్టా పెంచల్‌దాస్‌లు పేర్కొన్నారు. ప్రపంచ పుస్తక రచయిత దినోత్సవాన్ని ఆదివారం స్థానిక గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు శ్రీనివాసులు, గాడి ఇంతియాజ్ అహ్మద్, ప్రధానోపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు, హరి, శివరాం, రకీబ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్ల దాడి టీడీపీ కార్యకర్తల పనే

సిద్దవటం : ప్రజల్లో టీడీపీ పరిస్థితి రోజురోజుకు దిగజారుతుండటంతో ప్రజల్లో సానుభూతి పొందేందుకు చంద్రబాబు రాళ్ల దాడి అంటూ డ్రామాకు తెర లేపారని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని నేకనాపురంలో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎర్రగొండుపాలెంలో చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి చేసింది వైఎస్సార్‌సీపీ అని చెప్పడాన్ని తప్పుబట్టారు. వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సంక్షేమ పాలనను ఓర్వలేకే టీడీపీ నాయకులు ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నారుపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, మండల యూత్ కన్వీనర్ క్రిష్ణచైతన్య, ఎల్లారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద దర్గా స్థలం పరిశీలన



దర్గా స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్, తహసీల్దార్ మురళీకృష్ణ

చిట్వేలి : వివాదాస్పద స్థలంగా ఉన్న బుర్హానుద్దీన్ దర్గా స్థలాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, చిట్వేలి తహసీల్దార్ మురళీకృష్ణతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి సర్వేలు నిర్వహించారు. పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేసి రెండు, మూడు రోజులలో అందజేయాలని తెలియజేశారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ మురళీకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణంపై లబ్ధిదారులతో సమావేశం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆనంద్ వర్ధన్

పుల్లంపేట : జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచనల మేరకు పుల్లంపేట సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులు ఆనంద్ వర్ధన్ లబ్ధిదారులతో గృహనిర్మాణంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, లబ్ధిదారులందరూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలను ప్రథమ స్థానానికి తీసుకురావాలంటే లబ్ధిదారుల సహకారం అవసరమని తెలియజేశారు.

ప్రారంభమైన మహాభారత యజ్ఞం



హరికథగా వివరిస్తున్న డీఎస్‌కే సీతామాలక్ష్మి

రామాపురం : మండల కేంద్రంలో ఆదివారం నుంచి 13వ శ్రీ పంచమ వేద మహాభారత యజ్ఞం వైభవంగా ప్రారంభమైంది. 18 రోజులపాటు జరిగే కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఉదయం నుంచే మహాభారత యజ్ఞ ప్రదేశంలో యాగశాలలో పూజలు నిర్వహించారు. హోమాలు, పంచ పాండవుల పూజలు, కలశ పూజలు వంటివి నిర్వహించి మధ్యాహ్నం డీఎస్‌కే సీతామాలక్ష్మి సర్పయాగం, వ్యాస జననం వంటివి హరికథ రూపంలో ప్రజలకు వివరించారు. రాత్రి సమయంలో లక్కిరెడ్డిపల్లె శ్రీ వెంకటేశ్వర నాట్యమండలిచే మహాభారత యజ్ఞాన్ని వేషధారణలో చేసి చూపించారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రమేష్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డిల పర్యవేక్షణలో నిర్వహించారు. నాగబసిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దామోదర్‌నాయుడు, భక్తవత్సలరెడ్డి తదితరులు మహాభారత యజ్ఞానికి సహాయ సహకారాలు అందించనున్నారు.

34 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయచోటి టౌన్ : రాయచోటి లయన్స్ కంటి ఆస్పత్రిలో 34 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి కంటి జబ్బులున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి ఉచితంగానే ఆపరేషన్లు చేశారు. అలాగే గత వారం ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా కళ్ల అద్దాలు, మందులు అందజేశారు. కంటి పరీక్షల నిర్వహించుకోవడానికి అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి వందలాదిగా వచ్చారు. కార్యక్రమంలో కంటి ఆస్పత్రి చైర్మన్ వైవి స్వరూపగుప్తా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెన్నూరి అన్వర్ బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆస్పత్రి కోశాధికారి శివప్రసాద్ రెడ్డి, లయన్ జయరామిరెడ్డి, డాక్టర్లు సురేష్ బాబు, భార్గవి, మహాలక్ష్మి, ఆప్తాలమిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం ఉమామహేశ్వరుల కల్యాణం



కల్యాణ ఉత్సవమూర్తులు

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని గడ్డివీధిలో వెలసిన బసవేశ్వర స్వామి మఠంలో ఆదివారం ఉమామహేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అక్షయ తదియ, బసవ జయంతిని పురస్కరించుకొని మఠం అధిపతులు రుద్రమూర్తి, సురేష్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కల్యాణ మూర్తులను కొలువుదీర్చి పులివెందులకు చెందిన మిట్టమల్లేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు రుద్రమూర్తి, బసవరాజుల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోత్సకంగా జరిపించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

వైభవంగా వేల్పు ఉత్సవం



ఇతర ప్రాంతా నుంచి వచ్చిన నాణేలు

మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ దొడ్డిశిద్దయ్యగారిపల్లె సమీపంలో ఆదివారం రాత్రి ఆవుల వేల్పు అంగరంగ వైభవంగా జరిగింది. ఎనిమిది సంవత్సరాల తరువాత వేల్పు ఉత్సవం నిర్వహిస్తుండటంతో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేల్పులో ఇతర ప్రాంతాల నుంచి స్వామి వారి నాణేలు, దేవరెద్దులు తరలివచ్చాయి. వేపచెట్టుకు దారంతో రొట్టికు కట్టిన విసురరాయిని చూసేందుకు భక్తులు తరలివచ్చారు. ఉత్సవం సందర్భంగా మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

- సంబేపల్లె



వేపచెట్టుపై నుంచి దారంతో రొట్టికు కట్టిన విసురురాయి



వేల్పు ఉత్సవంలో పాల్గొన్న ప్రజలు

విజయవంతం చేయండి



సమావేశం అనంతరం ఏపీజీఈఏ జిల్లా నాయకులు

రాయచోటి టౌన్ : ఈ నెల 30వ తేదీన రాజమహేంద్రవరంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఏపీజీఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు యగ్రపురెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఏపీజీఈఏ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, అవుట్ సోర్సింగ్ కార్మికులు, కాంట్రాక్ట్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి గురుప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల పరీక్ష

మదనపల్లె సిటీ: స్థానిక చంద్రాకాలనీలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఆదివారం 5వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 298 మంది ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 216 మంది పరీక్ష రాశారు.

వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంత్యుత్సవాలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రాజంపేట : పట్టణంలోని శంకరమఠంలో శ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలు కలశస్థాపనతో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అద్వైత సమితి వేదపండితులు అవధానం రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో సమితి అధ్యక్షుడు పి.వల్లభరావు దంపతుల నేతృత్వంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహావాచనం, గణపతి హోమం, మూలవరులకు మహన్యాసపూర్వ ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కోశాధికారి శ్రీకాంత్, విజయకృష్ణ, వైఎస్ జయసింహ, అమ్మవారిశాల అర్చకులు సుబ్బరాయుడు, సాయిబాబా దేవస్థానం విజయకుమార్, దినేష్‌కుమార్, సోమశేఖర్‌శర్మ, శంకరమఠం ప్రధానఅర్చకుడు చోరగుడి దశరథరామశర్మ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

మదనపల్లె : బలిజసేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో సోమవారం ఉదయం జరగనున్న శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ఆవిష్కరణకు పెద్దసంఖ్యలో బలిజ కులస్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షులు బీపీఎల్.విజయ్‌కుమార్ కోరారు. ఆదివారం స్థానిక బలిజసేవాసమితి కార్యాలయంలో శ్రీ కృష్ణదేవరాయ విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లు, ఆహ్వానానికి సంబంధించి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీపీఎల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పాతికేళ్లుగా శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటుపై అలుపెరగకుండా ప్రయత్నిస్తూనే వచ్చామన్నారు. ప్రస్తుతానికి విగ్రహ ఏర్పాటు కల సాకారం కావడం, ఆవిష్కరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. కార్యక్రమంలో బలిజలు పాల్గొన్నారు.